

వరల్డ్‌కప్ 2023

ఫైనల్
భారత్
X
ఆస్ట్రేలియా
మ. 2.00 నుంచి
వేదిక: అహ్మదాబాద్

# ఫైనల్ ఫైట్

**భారత్ Xఆస్ట్రేలియా వన్డే వరల్డ్‌కప్ తుది సమరం**

**మూడుపై భారత్ గురి సిక్సర్‌పై ఆసీస్ నజర్**

నెల రోజులకు పైగా క్రీడాభిమానులను ఊర్రూతలూగించిన వన్డే ప్రపంచకప్ చివరి అంకానికి వచ్చేసింది. మరికొన్ని గంటల్లో విశ్వ విజేతను తేల్చే సమరానికి తెరలేవనుంది.

టోర్నీ ప్రారంభం నుంచి అప్రతిహత విజయాలతో దూసుకెళ్తున్న టీమ్ ఇండియా.. ఐదుసార్లు విశ్వ విజేత ఆస్ట్రేలియాతో అహ్మదాబాద్ వేదికగా అమీతుమీకి సిద్ధమైంది. బౌలింగ్, బ్యాటింగ్, ఫీల్డింగ్‌లో బలంగా ఉన్న రోహిత్‌సేన.. కంగారూ సవాల్‌ను అధిగమించి ముచ్చటగా మూడోసారి విశ్వ విజేతగా నిలువాలని 140 కోట్ల మంది భారతీయులు ఆశిస్తుంటే.. సిక్సర్ కొట్టాలని ఆసీస్ చూస్తున్నది.

లక్షా ముప్పై వేల మంది అభిమానుల జయజయ ధ్వానాల మధ్య, అతిరథ మహారథుల సమక్షంలో జరుగనున్న మెగా ఫైనల్లో రోహిత్, కోహ్లీ, షమీ జోరు కొనసాగించాలని చూస్తుంటే.. భారీ జనసందోహాన్ని నోరు మూపించడంలో వచ్చే కిక్కే వేరని ఆస్ట్రేలియా కెప్టెన్ కమిన్స్ మాటల యుద్ధానికి తెరలేపాడు.

రెండు దశాబ్దాల క్రితం 2003లో ఆస్ట్రేలియాతో జరిగిన వరల్డ్‌కప్ ఫైనల్లో పరాజయం పాలైన భారత్.. ఈ సారి పట్టు వదల కూడదని చూస్తూంటే.. గత మ్యాచ్‌ల్లో కనబర్చిన పోరాట పటిమను మరింత ముందుకు తీసుకెళ్లాలని ఆసీస్ భావిస్తున్నది! బలాబలాల పరంగా సమఉజ్జీలుగా కనిపిస్తున్న ఇరు జట్ల మధ్య సమరంలో మరి విజయం ఎవరిని వరిస్తుందో చూడాలి!



అహ్మదాబాద్: పుష్కర కాలం తర్వాత సొంతగడ్డపై జరుగుతున్న ప్రతిష్ఠాత్మక వన్డే ప్రపంచకప్‌లో ట్రోఫీని ముద్దాడేందుకు టీమ్ ఇండియా ఒక్క అడుగు దూరంలో నిలిచింది. టోర్నీ ఆసాంతం ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకున్న రోహిత్ సేన ఆదివారం అహ్మదాబాద్‌లోని ప్రపంచంలోనే అతి పెద్ద క్రికెట్ స్టేడియంలో జరుగనున్న వరల్డ్‌కప్ ఫైనల్లో ఆస్ట్రేలియాతో తలపడనుంది. ఇప్పటి వరకు అత్యధికంగా ఆసీస్ ఐదుసార్లు ప్రపంచకప్ నెగ్గితే.. భారత్ రెండు సార్లు ట్రోఫీని ముద్దాడింది. మరి ఈ సారి టీమ్‌ఇండియా హ్యాట్రిక్ కొడుతుందా.. లేక ఆసీస్ సిక్సర్ దంచుతుందా చూడాలి. ఈ మెగాటోర్నీలో ఆడిన పది మ్యాచ్‌ల్లోనూ భారత్‌కు పరాజయం అన్నదే ఎదురుకాకపోగా.. టోర్నీ ఆరంభంలో రెండు మ్యాచ్‌లు ఓడిన తర్వాత ఆసీస్ పడి లేచిన కెరటంలా ఉవ్వెత్తున ఎగిసి వరుసగా ఎనిమిది మ్యాచ్‌లు నెగ్గింది. లీగ్ దశలో ఇరు జట్ల మధ్య జరిగిన పోరులో భారత్ విజయం సాధించగా.. దానికి బదులు తీర్చుకోవాలని కంగారూలు కాచుకు కూర్చున్నారు. భారత జట్టు విశ్వ విజేతగా నిలువాలని దేశ వ్యాప్తంగా యజ్ఞాలు, హోమాలు సాగుతున్నాయి. 1983 ప్రపంచకప్‌లో కపిల్‌దేవ్ సేన భారత్‌కు తొలి విశ్వ కప్పు అందించగా.. పన్నెండేండ్ల క్రితం 2011లో ధోనీ సారథ్యంలోని టీమ్‌ఇండియా రెండోసారి ట్రోఫీ చేజిక్కించుకుంది. ఇప్పుడు ఆ అమృత ఘడియలకు ఒక్క విజయం దూరంలో ఉంది. గత రెండు వన్డే ప్రపంచకప్‌లలో సెమీఫైనల్లో వెనుదిరిగిన టీమ్ ఇండియా ఈ సారి కప్పు కొట్టేందుకు సమాయత్తంగా ఉంది. బ్యాటింగ్‌లో కెప్టెన్ రోహిత్ శర్మ జట్టుకు మెరుపు ఆరంభాలను ఇస్తుండగా.. శుభ్‌మన్ గిల్ మంచి టచ్‌లో ఉన్నాడు. ఇక టోర్నీలో అత్యధిక పరుగుల వీరుడు విరాట్ కోహ్లీ ఫుల్ ఫామ్‌లో ఉండగా.. మిడిలార్డర్‌లో శ్రేయస్, రాహుల్ కీలకం కానున్నారు. సూర్యకుమార్ భారీ ఇన్నింగ్స్ బాకీ ఉండగా.. అతడికి అవకాశం రాకుండా టాపార్డరే పని ముగించాలని అభిమానులు ఆశిస్తున్నారు. ఇక బౌలింగ్ విషయానికి వస్తే.. లేటుగా జట్టులోకి వచ్చిన షమీ ఫుల్ జోష్‌లో ఉంటే.. బుమ్రా, సిరాజ్ అతడికి సహకరిస్తున్నారు. పిచ్ స్పిన్‌కు సహకరిస్తే.. కుల్దీప్, జడేజా నుంచి ప్రత్యర్థులకు తిప్పలు తప్పకపోవచ్చు. మరోవైపు పోరాటానికి మారుపేరైన ఆస్ట్రేలియా కూడా బలంగా ఉంది. వార్నర్, హెడ్, మార్ష్, స్మిత్, లబుషేన్, మ్యాక్స్‌వెల్ రూపంలో వారికి శత్రు దుర్భేధ్యమైన బ్యాటింగ్ లైనప్ ఉంది. కెప్టెన్ కమిన్స్‌తో పాటు స్టార్క్, హజిల్‌వుడ్, జాంపాను ఎదుర్కోవడం శక్తికి మించిన పనే.


### తుది జట్లు (అంచనా)

**భారత్:** రోహిత్ (కెప్టెన్), గిల్, కోహ్లీ, శ్రేయస్, రాహుల్, సూర్య, జడేజా, షమీ, బుమ్రా, కుల్దీప్, సిరాజ్.
**ఆస్ట్రేలియా:** కమిన్స్ (కెప్టెన్), వార్నర్, హెడ్, మార్ష్, స్మిత్, లబుషేన్, మ్యాక్స్‌వెల్, ఇంగ్లిస్, స్టార్క్, హజిల్‌వుడ్, జాంపా.

### పిచ్, వాతావరణం

నెల రోజుల క్రితం భారత్, పాకిస్థాన్ మధ్య ఇక్కడ జరిగిన మ్యాచ్‌కు వాడిన పిచ్‌పైనే ఫైనల్ జరగనుంది. క్రీజులో నిలదొక్కుకుంటే భారీ స్కోరు సాధ్యమే. వాతావరణం చల్లగా ఉండనుంది. మ్యాచ్‌కు వర్ష సూచనలేదు.

### ఎవరు ఎన్ని సార్లు?



| ఆస్ట్రేలియా | వెస్టిండీస్ | పాకిస్థాన్ |
|---|---|---|
| 1987 | 1975 | 1992 |
| 1999 | 1979 | |
| 2003 | **భారత్** | **శ్రీలంక** |
| 2007 | 1983 | 1996 |
| 2015 | 2011 | **ఇంగ్లండ్** 2019 |

**మ. 2.00 నుంచి**

| ప్రైజ్ మనీ | |
|---|---|
| విజేత | రూ. 33 కోట్లు |
| రన్నరప్ | రూ. 16 కోట్లు |

### మెగాటోర్నీలో ఇలా..

**పరుగుల ధీరులు**



1) కోహ్లీ 711
2) డికాక్ 594
3) రచిన్ 578
4) మిచెల్ 552
5) రోహిత్‌శర్మ 550

**వికెట్ల వీరులు**



1) షమీ 23
2) జంపా 22
3) మదుశనక 21
4) కోట్జె 20
5) అఫ్రీది 18

**2** భారత్, ఆస్ట్రేలియా ప్రపంచకప్ ఫైనల్లో తలపడటం ఇది రెండో సారి

**4** భారత్‌కు ఇది నాలుగో వరల్డ్ కప్ ఫైనల్. 1983, 2011లో విజేతగా నిలిచిన టీమ్‌ఇండియా.. 2003లో రన్నరప్‌తో సరిపెట్టుకుంది.

### ఫైనల్ చేరారిలా..

**భారత్**

| | |
|---|---|
| ఆస్ట్రేలియాపై | 6 వికెట్ల తో |
| అఫ్గానిస్థాన్‌పై | 8 వికెట్ల తో |
| పాకిస్థాన్‌పై | 7వికెట్ల తో |
| బంగ్లాదేశ్‌పై | 7వికెట్ల తో |
| న్యూజిలాండ్‌పై | 4 వికెట్ల తో |
| ఇంగ్లండ్‌పై | 100పరుగుల తో |
| శ్రీలంకపై | 302 పరుగులతో |
| దక్షిణాఫ్రికాపై | 243 పరుగులతో |
| నెదర్లాండ్స్‌పై | 160 పరుగుల తో |
| న్యూజిలాండ్ (సెమీస్) | 70పరుగుల తో |

**ఆస్ట్రేలియా**

| | |
|---|---|
| భారత్ చేతిలో | 6 వికెట్ల తేడాతో ఓటమి |
| దక్షిణాఫ్రికా చేతిలో | 134పరుగులతో ఓటమి |
| శ్రీలంకపై | 5 వికెట్ల తేడాతో |
| పాకిస్థాన్‌పై | 62 పరుగుల తేడాతో |
| నెదర్లాండ్స్‌పై | 309 పరుగుల తేడాతో |
| న్యూజిలాండ్‌పై | 5 పరుగుల తేడాతో |
| ఇంగ్లండ్‌పై | 33పరుగుల తేడాతో |
| అఫ్గానిస్థాన్‌పై | 3 వికెట్ల తేడాతో |
| బంగ్లాదేశ్‌పై | 8 వికెట్ల తేడాతో |
| దక్షిణాఫ్రికాపై | (సెమీస్) 3 వికెట్ల తేడాతో |

### ముఖాముఖి పోరు

| ఓవరాల్‌గా: 150 మ్యాచ్‌లు | |
|---|---|
| భారత్: | 57 |
| ఆస్ట్రేలియా: | 83 |
| ఫలితం తేలనివి: | 10 |
| **ప్రపంచకప్‌లో: 13 మ్యాచ్‌లు** | |
| భారత్: | 5 |
| ఆస్ట్రేలియా: | 8 |



## అట్టహాసంగా..

భారత్, ఆస్ట్రేలియా మధ్య జరిగే ప్రపంచకప్ ఫైనల్‌ను ప్రత్యక్షంగా వీక్షించేందుకు పలువురు అతిరథ మహారథులు అహ్మదాబాద్‌కు విచ్చేస్తున్నారు. ఇప్పటికే ప్రధాని నరేంద్రమోదీ రాక ఖరారు కాగా ఆస్ట్రేలియా ప్రధానమంత్రి అంథోనీ అల్బనీస్‌కు ఆహ్వానం పంపినట్లు తెలిసింది. వీరికి తోడు బాలీవుడ్ బాద్‌షా అమితాబ్ బచ్చన్, సూపర్‌స్టార్ రజినీకాంత్,తారాగణం మొతెరా స్టేడియంలో సందడి చేసేందుకు రాబోతున్నారు. లక్షా 30 వేల సామర్థ్యంతో ప్రపంచంలోనే అతిపెద్ద స్టేడియంగా పేరొందిన ఈ వేదికలో ప్రతిష్ఠాత్మక పోరు కోసం ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. మరోవైపు ఫైనల్ రోజున పలు కార్యక్రమాలకు బీసీసీఐ రూపకల్పన చేసింది. మధ్యాహ్నం 12.30కు స్టేడియంపైన 10 నిమిషాల పాటు సూర్యకిరణ్ విమానాలు విన్యాసాలు చేయనున్నాయి. వింగ్ కమాండర్ సిదేశ్ కార్తీక్ నేతృత్వంలో తొమ్మిది విమానాలు రకరకాల విన్యాసాలతో కట్టిపడేయనున్నాయి. సాయంత్రం 5.30కు ఇప్పటి వరకు ప్రపంచకప్ గెలిచిన కెప్టెన్లందరినీ బీసీసీఐ ఘనంగా సన్మానించనుంది. ప్రముఖ మ్యూజిక్ డైరెక్టర్ ప్రీతమ్ నేతృత్వంలో 500 మందికి పైగా డ్యాన్సర్లు వివిధ సూపర్‌హిట్ పాటలకు నృత్యాలు చేయనున్నారు. యూకేకు చెందిన ఎల్‌ఎమ్ ప్రొడక్షన్స్..స్టేడియంలో లేజర్ షోతో ప్రేక్షకులను మరోలోకంలోకి తీసుకుపోనుంది.

## టైటిల్ పోరుకు సిన్నర్

ట్యురిన్(ఇటలీ) : జానిక్ సిన్నర్ ఎటీపీ ఫైనల్స్‌లో టైటిల్ పోరుకు చేరుకున్నాడు. శనివారం జరిగిన సెమీస్‌లో సిన్నర్ 6–3, 6–7(4), 6–1తో డేనియల్ మెద్వెద్‌పై గెలుపొందాడు. టాప్ ఎనిమిది ర్యాంకుల్లోని ఆటగాళ్లు పోటీపడే ఈ టోర్నీలో సిన్నర్ టైటిల్ పోరులో నొవాక్ జొకోవిచ్–కార్లోస్ అల్కారజ్‌ల మధ్య విజేతతో తలపడతాడు. ఈ టోర్నీలో ఆడిన నాలుగు లీగ్ మ్యాచ్‌లలో సిన్నర్ విజయాలు నమోదు చేశాడు. కాగా అంతకుముందు జరిగిన చివరి లీగ్ పోటీలో అల్కారజ్ 6–4, 6–4తో డేనియల్ మెద్వెదేవ్‌పై గెలుపొంది టాప్ ర్యాంకర్ జొకోవిచ్‌తో సెమీస్ పోరుకు సిద్ధమయ్యాడు.



ఖైరతాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి దానం నాగేందర్‌కు చెక్కు అందజేస్తున్న తన్నీరు మేఘన

## హైదరాబాద్ అభివృద్ధికి ఫిదా

- బీఆర్‌ఎస్‌కు మద్దతు యువత
- దానంకు యువతి లక్ష విరాళం

బంజారాహిల్స్, నవంబర్ 18: హైదరాబాద్ అభివృద్ధికి ఫిదా అవుతున్న యువత బీఆర్‌ఎస్‌కు మద్దతుగా నిలుస్తున్నారు. తాజాగా ఫ్యాషన్ డిజైనర్‌గా పనిచేస్తున్న ఓ యువతి బీఆర్‌ఎస్‌కు మద్దతు పలుకడంతోపాటు ఎన్నికల ఖర్చు కోసం రూ.లక్ష విరాళం అందించారు. ఖైరతాబాద్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి దానం నాగేందర్ ఇంటింటి ప్రచారంలో భాగంగా శనివారం ఫిలింనగర్‌లోని ఛత్రపతి శివాజీనగర్ బస్తీకి వెళ్లారు. బస్తీలో నివాసం ఉంటూ ఫ్యాషన్ డిజైనర్ తన్నీరు మేఘన అనే యువతి తల్లితో కలిసి దానం నాగేందర్‌కు హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. ఎన్నికల ఖర్చు కోసం అంటూ రూ. లక్ష చెక్కును అందించడంతో దానం నాగేందర్‌తోసహా అక్కడున్న వారంతా షాకయ్యారు. 'నాకు ఎందుకమ్మా డబ్బులు'? అని దానం ప్రశ్నించగా.. మంత్రి కేటీఆర్ నాయకత్వంలో హైదరాబాద్‌లో అనేక సంస్థలు వచ్చాయని, లక్షల మంది యువతకు ఉపాధి దొరకడంతో పాటు ఎక్కడ చూసినా అభివృద్ధి కనిపిస్తున్నదని, అందుకే తనవంతుగా పార్టీ కోసం రూ. లక్ష అందిస్తున్నానని యువతి చెప్పింది. దీంతో దానంతోపాటు వెంట ఉన్న కార్యకర్తలు మేఘనను అభినందించారు.

## ఎన్టీఆర్ నాటిన మొక్కను నేను

- నా రాజకీయ జీవితం దివంగత సీఎం పెట్టిన భిక్ష
- కమ్మ వారి సేవా సమితి వన మహోత్సవంలో మంత్రి తలసాని
- చంద్రబాబు అరెస్ట్‌పై ఏపీ ప్రభుత్వం తీరుపై ఖండన



కమ్మవారి వన మహోత్సవంలో మాట్లాడుతున్న మంత్రి తలసాని

అమీర్‌పేట, నవంబర్ 18: దివంగత ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు నాటిన మొక్కను తానని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఆ మహనీయుడు 1994లో నాటిన ఈ మొక్క.. నేడు మహా వృక్షమైందని తెలిపారు. తన రాజకీయ జీవితం ఎన్టీఆర్ పెట్టిన భిక్షేనని ఆయన్ను ఎన్నటికీ మరువనని చెప్పారు. సనత్‌నగర్ మోడల్‌కాలనీలో శనివారం ఎస్‌ఆర్‌నగర్ కమ్మవారి సేవా సమితి ఆధ్వర్యంలో జరిగిన కార్తీక వన మహోత్సవంలో తలసాని పాల్గొని మాట్లాడారు. రాజకీయాలను రాజకీయాలుగానే చూడాలని, వ్యక్తిగత కక్షలకు కారణం కాకూడదని అన్నారు. ఏపీ మాజీ సీఎం చంద్రబాబునాయుడు అరెస్ట్ విషయంలో అక్కడి వైసీపీ ప్రభుత్వం అనుసరించిన విధానాన్ని తలసాని తీవ్రంగా ఖండించారు. ప్రజలు అప్పగించిన బాధ్యతను ప్రజా ప్రయోజనాలకు తప్ప వ్యక్తిగత స్వార్థాలకు వినియోగంచరాదని, అధికారం ఎవరికీ శాశ్వతం కాదని అన్నారు. నాలుగైదు దశాబ్దాల నుంచి హైదరాబాద్‌లో స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకొని జీవిస్తున్న వారంతా ఇక్కడి వారేనని చెప్పారు. వారికి ఎటువంటి ఆపద వచ్చినా ఎదుర్కోవడానికి తాను ముందు వరుసలో ఉంటానని 2014లో ఇచ్చిన వాగ్దానాన్ని కట్టుబడి ఉన్నానని తెలిపారు. తెలంగాణ వస్తే ఏదో జరిగిపోతుందని రాజకీయంగా సత్యదూరమైన వ్యాఖ్యలతో ఇక్కడ నివాసమేర్పర్చుకున్న వారిని భయాందోళనలకు గురిచేసే ప్రయత్నాలు అనేకం జరిగాయని, వాటన్నింటికీ సీఎం కేసీఆర్ తనదైన పాలనతో సమాధానమిచ్చారని తెలిపారు.

**అమీర్‌పేటలో ఎన్టీఆర్ విగ్రహం**

అమీర్‌పేట్‌లో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుకు సహకరిస్తానని తలసాని తెలిపారు. ఇటీవల ఎన్టీఆర్ శత జయంతిని పురస్కరించుకుని మోతీనగర్, మూసాపేటలో ఆ మహనీయుని విగ్రహాలు ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తుంటే అధికారులు అడ్డుకోవడాన్ని కూకట్‌పల్లి ఎమ్మెల్యే తన దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. ఆ విగ్రహాన్ని తానే ఆవిష్కరించానని గుర్తుచేశారు. కార్యక్రమంలో కమ్మవారి సేవా సమితి ప్రతినిధులు కొత్తపల్లి మధుసూదన్‌రావు, రాజారావు, నరేందర్, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.



కోస్గిలో మాట్లాడుతున్న మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్. చిత్రంలో మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, కొడంగల్ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్

## ముదిరాజ్‌లను మోసం చేసిన కాంగ్రెస్

- రాజకీయంగా అండగా నిలిచిన కేసీఆర్
- మండలి డిప్యూటీ చైర్మన్ ప్రకాశ్
- ముదిరాజులతో ఆత్మీయ సమ్మేళనం
- హాజరైన మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి

కోస్గి, నవంబర్ 18 : ముదిరాజ్ బిడ్డలను మోసం చేసింది కాంగ్రెస్ పార్టీయేనని శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ ఆరోపించారు. నారాయణపేట జిల్లా కోస్గిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శనివారం ముదిరాజ్‌ల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి గనుల శాఖ మంత్రి పట్నం మహేందర్ రెడ్డి, కొడంగల్ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా బండ ప్రకాశ్ మాట్లాడుతూ.. ముదిరాజ్‌లు రాజకీయంగా ఎదిగే దిశగా సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని తెలిపారు. ముదిరాజ్‌ల ఆత్మగౌరవాన్ని పెంచే విధంగా సొసైటీలు, మత్స్యశాఖల ద్వారా అధికారాన్ని కట్టబెట్టినట్టు పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని కోకాపేటలో 5 ఎకరాల్లో ముదిరాజ్ భవన్ నిర్మాణాన్ని చేపట్టడంతోపాటు రూ.3 కోట్లతో మహబూబ్‌గనగర్‌లో, రూ.2 కోట్లతో వనపర్తిలో, రూ.కోటితో కొడంగల్‌లో, రూ.30 లక్షలతో కోస్గిలో ముదిరాజ్ భవన్ నిర్మాణాలకు భూమిపూజలు చేశామని తెలిపారు.

**కులవృత్తులకు పూర్వవైభవం**

అంతరిస్తున్న కులవృత్తులకు సీఎం కేసీఆర్ పూర్వవైభవాన్ని తీసుకొచ్చినట్టు మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి తెలిపారు. గత ప్రభుత్వాలు ముదిరాజ్‌లను పట్టించుకోలేదని విమర్శించారు. బీఆర్‌ఎస్ సర్కార్ ఎన్నో అద్భుత సంక్షేమ పథకాలను అందించి, ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు సహకారం అందించినట్టు చెప్పారు. ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్‌ను నమ్ముకుంటే నట్టేట మునిగినట్టేనని తెలిపారు.

## రేపటి నుంచి వరల్డ్ హెరిటేజ్ వేడుకలు

హైదరాబాద్, నవంబర్ 18 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ పబ్లిక్ గార్డెన్స్‌లోని భగవాన్ మహవీర్ ఆడిటోరియం, స్టేట్ మ్యూజియంలో సోమవారం నుంచి వరల్డ్ హెరిటేజ్ వేడుకలను నిర్వహించనున్నట్టు పర్యాటక, సాంస్కృతిక శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 25 వరకు జరిగే ఈ వేడుకల సందర్భంగా స్మారక చిహ్నాల ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఆగాఖాన్ ట్రస్ట్, దక్కన్ హెరిటేజ్ అకాడమీ, సిటీ కాలేజీ విద్యార్థుల ఆధ్వర్యంలో కుతుబ్‌షాహీ టూంబ్స్ నుంచి సాయి దానిమా టూంబ్స్ వరకు హెరిటేజ్ వాక్ నిర్వహించనున్నట్టు తెలిపారు. సిటీ కాలేజీ విద్యార్థులకు వ్యాసరచన, పాఠశాలల విద్యార్థులకు డ్రాయింగ్, స్కేటింగ్ పోటీలను నిర్వహిస్తామని పేర్కొన్నారు.

## 'పైగా' భూములపై హైకోర్టు తీర్పు వాయిదా

హైదరాబాద్, నవంబర్ 18 (నమస్తే తెలంగాణ): రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లో హెచ్‌ఎండీఏకు చెందిన 200 ఎకరాల 'పైగా' భూముల వివాదంపై హైకోర్టు తీర్పును రిజర్వు చేసింది. ఆ భూములను 'పైగా' కుటుంబసభ్యుల నుంచి తమ పూర్వీకులు కొనుగోలు చేశారని, ఇందులో అధికారులు, పోలీసులు జోక్యం చేసుకోకుండా ఆదేశాలివ్వాలని కోరుతూ ఫలక్‌నుమా వాసి యాహిరా ఖురేషి, వట్టేపల్లికి చెందిన మహ్మద్ మొయినుద్దీన్ దాఖలు చేసిన పిటిషన్లపై హైకోర్టు సీజే జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం శనివారం మరోసారి విచారణ చేపట్టింది. ప్రభుత్వం తరపున అడ్వకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్ వాదనలు వినిపిస్తూ.. ఈ భూములకు సంబంధించి గతంలో కోర్టు తీర్పులు ఇచ్చినట్టు పిటిషనర్లు తప్పుడు పత్రా లు సృష్టించారని తెలిపారు. లేని తీర్పులను ఉన్నట్టు చూపి ఏకంగా కోర్టునే మోసగించేందుకు ప్రయత్నించిన పిటిషనర్లపై చర్యలు తీసుకోవారని కోరారు. ఒకవేళ ఈ వ్యవహారంపై దర్యాప్తు చేయించదలిస్తే ఐపీఎస్ అధికారి అవినాశ్ మహంతి సహకరించగలరని పేర్కొన్నారు. దీనిపై పిటిషనర్ల తరపు న్యాయవాది స్పందిస్తూ.. ఆ భూములను 'పైగా' కుటుంబసభ్యుల నుంచి తమ కక్షిదారుల పూర్వీకులు కొనుగోలు చేశారని, ఆ భూముల విషయంలో అధికారులు జోక్యం చేసుకోకుండా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ఇరుపక్షాల వాదనలు ముగిసిన అనంతరం తీర్పును వాయిదా వేస్తున్నట్టు హైకోర్టు ప్రకటించింది.

## గాజాలోని షిఫా దవాఖాన ఖాళీ

గాజా, నవంబర్ 18: హమాస్‌ను అంతమొందించడానికి దక్షిణ ప్రాంతాన్ని లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయెల్ దళాలు దాడులు కొనసాగిస్తుండటంతో గాజాలోని అతిపెద్ద అల్–షిఫా దవాఖాన ఖాళీ అయ్యింది. ఇప్పటికే ఇజ్రాయెల్ దళాలు తమ ఆధీనంలోకి తెచ్చుకున్న ఈ దవాఖానను రోగులు, డాక్టర్లు, సిబ్బంది, యుద్ధం కారణంగా ఆశ్రయం పొందుతున్న పలువురు పాలస్తీనా పౌరులు శనివారం ఖాళీ చేసి పశ్చిమ ప్రాంతానికి తరలివెళ్లారు. పూర్తి అస్వస్థతతో, కదలలేని స్థితిలో ఉన్న రోగులు, వారికి సహాయకులుగా కొందరు సిబ్బంది మాత్రమే దవాఖానలో మిగిలారు.



కరీంనగర్‌లో మంత్రి గంగుల కమలాకర్‌కు తిలకందిద్ది స్వాగతం పలుకుతున్న మహిళలు

## బండి సంజయ్‌కి ఓట్లు అడిగే అర్హత లేదు

- అవినీతి ఆరోపణలతోనే ఆయన అధ్యక్ష పదవి ఊడింది
- మంత్రి గంగుల కమలాకర్

కరీంనగర్ కార్పొరేషన్, నవంబర్ 18: కరీంనగర్ ఎంపీగా గెలిచినప్పటి నుంచి నియోజకవర్గ అభివృద్ధిని పట్టించుకోకుండా.. ఇప్పుడు అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న బండి సంజయ్‌కి ఇక్కడి ప్రజల ఓట్లు అడిగే అర్హత లేదని కరీంనగర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ పేర్కొన్నారు. శనివారం కరీంనగర్ రూరల్ మండలంతోపాటు నగరంలోని పలు డివిజన్లలో ప్రచారం చేశారు. ఆయాచోట్ల మంత్రి గంగుల మాట్లాడుతూ.. బండిపై బీజేపీ అధిష్ఠానమే అవినీతి ఆరోపణలు చేసి రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి తొలగించిందని అన్నారు.

## కోమటిరెడ్డి బ్రదర్స్ బ్రోకర్లు, జోకర్లు

- టికెట్లు ఇప్పిస్తామని కోట్లు వసూళ్లు
- బీఆర్‌ఎస్ నేత చెరుకు సుధాకర్

సూర్యాపేట, నవంబర్ 18 (నమస్తే తెలంగాణ): కోమటిరెడ్డి బ్రదర్స్ బ్రోకర్లుగా వ్యవహరిస్తూ జోకర్ల మాదిరిగా మాట్లాడుతున్నారని తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్‌ఎస్ నాయకుడు చెరుకు సుధాకర్ విమర్శించారు. వీరు నిలకడ లేకుండా పిచ్చిపట్టినట్టు మాట్లాడుతూ రాజకీయాలను స్వార్థానికి వాడుకుంటారని మండిపడ్డారు. తరచూ పార్టీలు మార డం, ఓ పార్టీలో ఉంటూ మరో పార్టీకి అనుకూలంగా మాట్లాడే కోమటిరెడ్డి బ్రదర్స్‌ను బ్రోకర్లు, జోకర్లు అనడంలో ఎలాంటి సందేహం లేదని అన్నారు. ఇటీవల కోమటిరెడ్డి బ్రదర్స్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై శనివారం ఆయన సూర్యాపేటలో మీడియాతో మాట్లాడారు. ఎన్నికల్లో రాజకీయ నాయకుల విమర్శలు, ప్రతి విమర్శలు సాధారణమే అయినా నకిరేకల్, సూర్యాపేట, తుంగతుర్తిలో కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మాట్లాడిన భాష, ప్రవర్తించిన తీరు అత్యంత అసహ్యాకరంగా ఉన్నదని అన్నారు. మునుగోడు ఉప ఎన్నికను తీసుకొచ్చి కాంగ్రెస్ పార్టీని పాతాళానికి తొక్కాలని చూసిన రాజగోపాల్‌రెడ్డి పక్కా కమర్షియల్ లీడర్ అని విమర్శించారు. దళిత ఎమ్మెల్యే అయిన చిరుమర్తి లింగయ్య, మంత్రి జగదీశ్‌రెడ్డిపై రాజగోపాల్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు బాధాకరమని అన్నారు. నల్లగొండ జిల్లా ఉద్యమ స్ఫూర్తిని అవమానించేలా ఆయన వ్యాఖ్యలు ఉన్నాయని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థులను అసెంబ్లీ గేటు తాకనీయమంటున్న రాజగోపాల్‌రెడ్డి.. అసెంబ్లీ ఏమైనా ఆయన అయ్య జాగిరా? అని ప్రశ్నించారు. కోమటిరెడ్డి బ్రదర్స్ భువనగిరి పార్లమెంట్ పరిధిలో అసెంబ్లీ టికెట్లు ఇస్తామని కోట్లు దండుకున్నది నిజం కాదా? అని నిలదీశారు. సీఎం కేసీఆర్‌ను ఎందుకు దించాలో చెప్పే దమ్ము ఉన్నదా? అని సవాల్ విసిరారు. జీవితమంతా బ్రోకర్ పనులు చేసిన కోమటిరెడ్డి బ్రదర్స్.. తక్షణమే ఆ పనులు మానేయాలని సూచించారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ బతికి బట్టకట్టాలంటే రాజగోపాల్‌రెడ్డి వంటి నాయకులను పార్టీ నుంచి పంపేయాలని సూచించారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.